ఎవరికి వారే యమునా తీరే..

- సెంట్రల్ లైటింగ్ పనులపై పలు పార్టీల్లో విభేదాలు
- ఎన్ని అడుగులు విస్తరించాలనే అంశంపై విభిన్న స్వరాలు
- వేర్వేరుగా సర్వేలు, నివేదిక ప్రకటనలు



విస్తరణ సర్వే నిర్వహిస్తున్న కాంగ్రెస్, టీడీపీ నాయకులు



వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో..

ములకలపల్లి: మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనుల అంశంలో ఏర్పడుతున్న భిన్నాభిప్రాయాలు స్థానిక వ్యాపారులను అయోమయంలో పడేస్తున్నాయి. అభివృద్ధిలో భాగంగా ఆర్అండ్‌బీ పరిధిలోని నిర్మాణాల తొలగింపు అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సహకారంలో 45 అడుగులకే పరిమితం చేస్తామంటూ అనధికారికంగా చెబుతుండగా.. వామపక్ష పార్టీలు ఈ విషయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 50 అడుగుల పరిధిలోని నిర్మాణాలను తొలగించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి.

ఇదిలా ఉండగా గురువారం సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు నూపా భాస్కర్, సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, ఊకంటి రవికుమార్‌ల ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సర్వే చేపట్టారు. రోడ్డుకిరువైపులా ఉన్న ప్రతీ ఇంటివద్ద టేపుతో కొలతలు వేస్తూ, వివరాలు సేకరించారు. దాదాపు 90 శాతం మంది 50 అడుగుల తొలగింపుకు సమ్మతించారని వాట్సప్ వేదికగా ప్రకటించారు.

45 అడుగులే ముద్దు..

టీడీపీ, బీజేపీ మద్దతులో అధికార కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజితోపాటు పలువురు నాయకులు సాయంత్రం వేళ ప్రత్యేకంగా సర్వే చేపట్టారు. వ్యాపారుల అభిప్రాయాలు సేకరించారు. 50 అడుగులు వద్దు, రోడ్డు విస్తరణ 45 అడుగులకే పరిమితం చేయాలని అత్యధిక మంది స్థానికులు పేర్కొన్నట్లు సోషల్ మీడియాలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు మరో అడుగు ముందుకు వేసి 45 అడుగులకు మద్దతుగా స్థానికంగా ర్యాలీ తీశారు. మొత్తంగా అధికార కాంగ్రెస్ పార్టీ, వామపక్ష పార్టీలు ఎవరికి వారే అన్నచందంగా కొనసాగుతుండగా.. అంతిమంగా ఏం జరుగుతుందోనని స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ముగిసిన బాలాజీ బ్రహ్మోత్సవాలు



స్వామి వారికి చక్రస్నానం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 23న స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై ఆరు రోజుల పాటు వైభవంగా కొనసాగాయి. గురువారం స్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, చతుస్థానార్చన, బలిహరణము, మహాపూరాహుతి, మహ కుంభప్రోక్షణ, పుష్పయాగం, దేవతోద్వాసన, ధ్వజావరోహణం, శృంగార డోలోత్సవం మొదలైన పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

స్వామి వారి చక్రస్నానం

శ్రీవారి చక్రస్నాన కార్యక్రమాన్ని గిరిధరాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం వైభవంగా జరిపించారు. భక్తులు స్వామి వారి చక్రస్నానం, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సేవలు స్ఫూర్తిదాయకం

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు వారు నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని క్లబ్ 320 ఈ జిల్లా గవర్నర్ సీహెచ్‌వి శివప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆవిర్భవించి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మణుగూరు సబ్ డివిజన్ ప్రాంతాలో 29 సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మండల పరిధిలోని రేగులగండిలో నిరుపేదలకు 20 చైర్లు, పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి, పలు ప్రదేశాల్లో 34 సిమెంట్ బల్లాలను గవర్నర్ సీహెచ్‌వి శివప్రసాద్ చేతుల మీదుగా వితరణగా అందజేశారు. బాలవెలుగు పాఠశాలకు రూ.10 వేల నిత్యావసర సరుకులు, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, విద్యాసామగ్రి, మున్సిపాలిటి, సమితిసింగారం పంచాయతీ వర్కర్లకు చీరెలు పంపిణీ చేశారు. బాలికల ఉన్నత పాఠశాలకు స్పోర్ట్స్ కిట్, విద్యార్థినులకు దుస్తులు, అన్నారం అంగన్‌వాడీ పిల్లలకు స్కూల్ బ్యాగులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆర్‌సి గబ్బేటి రాజయ్య, క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శి షేక్ మీరాహుస్సేన్, కోశాధికారి అడబాల నాగేశ్వరరావు, చార్టర్ ప్రెసిడెంట్ పి.హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అశ్వారావుపేటరూరల్: గాండ్లగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలోని గాండ్లగూడెం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ముందుగా గ్రామానికి చెందిన రామారావు అనే వ్యక్తి ఇటీవలె మృతి చెందగా.. చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో కాలినడక పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్య నారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, జ్యేష్ఠ సత్యనారాయణ చౌదరి, అట్టం నరేష్, భూక్యా ప్రసాద్, అలీబాబు పాల్గొన్నారు.

చండ్రుగొండ: నియోజకవర్గంలోని పేదల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. చండ్రుగొండలో నిరుపేద చర్మకార్మికుడు మిరియాల నాగులును ఆత్మీయంగా పలుకరించి ఆయనతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాల్యతండాలో శ్రీకోదండ చంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. మంగయ్యబంజర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రైతును పరామర్శించారు. రేపల్లెవాడ పంచాయతీలోని శ్రీరాపురంలో నిర్మించిన చేతిపంపు, డైరెక్ట్ పంపింగ్ సిస్టం బోరుబావిని ప్రారంభించారు. సమస్యలుంటే ప్రజలు నేరుగా చెప్పాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు సారేపల్లి శేఖర్, దారం గోవిందరెడ్డి, కేవబోయిన నర్సింహారావు, యండి.ఇమ్రాన్, ఫజల్ భక్ష్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను తొలగించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో కోతుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కోతులు విపరీతంగా ఉన్నాయని కోతులతో పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారని తెలిపారు. గ్రామస్తులు కొందరు కోతుల దాడిలో గాయపడ్డారని, సమస్య పరిష్కరించాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శికి విన్నవించారు. కార్యదర్శి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'పాదెం'కు సన్మానం

అశ్వాపురం: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను గురువారం భద్రాచలంలో క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు తూము పెదవీరరాఘవులు, చెంచల రాము, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బారాసు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంఖ్య పెంచాలి

చర్లరూరల్: చర్ల సీహెచ్‌సీలో వైద్య సిబ్బందిని పెంచాలని ప్రగతి శీల యువజన సంఘం(పీవైఎల్)జిల్లా ఉపాధ్యక్షుడు ముసలి సతీష్ డిమాండ్ చేశారు. ఒక ఎంబీబీయస్ డాక్టరు, ఇద్దరు స్టాఫ్ నర్సులతోనే కాలం వెళ్లదీస్తున్నారన్నారు. ఆస్పత్రిలో అప్రెంటీస్ చేస్తున్న ఎనిమిది మంది చేత వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. అప్రెంటీస్ చేస్తున్న వారికి కొంత వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చర్ల గోదావరి ఆవలి ఒడ్డున ఉన్న భద్రాద్రి పవర్ నుంచి వచ్చే విషవాయువుల ప్రభావం చర్ల మండల ప్రజలపై పడుతుందన్నారు. చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో చిరిగిడి నరేష్, ఝాన్సీ, వనిత, రాణి, రవళి, కావ్య, వల్లి, రాజులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కొప్పుల నీలంకు మాజీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు చేతుల మీదగా రూ.5వేలు ఆర్థికసాయం గురువారం అందజేశారు. బుధవారం కొప్పుల నీలం ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యి కట్టుబట్టలతో మిగిలారు. దీంతో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి భరోసా ఇస్తూ ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చేస్తామని హామీనిచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, నాయకులు కనుబుద్ది దేవా, బత్తుల శోభన్ బాబు, ధనగం రఘు,సవలం భద్రయ్య, జిలకర స్వర్ణ లత పోడియం మురళి పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ సాయినగర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్న ప్రసాద దాత బచ్చలకూరి వినయ్‌కుమార్-శ్రావణిలు సమేతంగా సాయినాథుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా అందజేత



పాయంకు ఓటర్ల జాబితా అందజేస్తున్న పాదెం వీరయ్య

భద్రాచలం: పినపాక నియోజకవర్గం ఎన్నికల, విద్యావంతుల ఎమ్మెల్సీ ఎన్నికల తుది ఓటర్ల జాబితాను ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అందజేశారు. గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో జాబితాను అందజేసిన అనంతరం మాట్లాడారు. సత్వరమే పోలింగ్ ఏజెంట్లను నియమిస్తూ బూత్ స్థాయిలో పార్లమెంటరీ ఎన్నికలకు సంబంధించి సన్నాహక ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రచార కార్యక్రమాలను ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



దుమ్ముగూడెం: బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: యువత క్రీడా పోటీల్లో రాణించాలని తప్పు దారి పట్టకుండా క్రీడలతో పాటు చదువులో రాణించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం మండలంలోని కే వీరభద్రపురం గ్రామంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేయడానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత క్రీడల పట్ల ఆసక్తితో ముందుకు రావాలని, యువత తప్పుదారి పట్టకుండా క్రీడల మీద ఆసక్తితో మెలిగి ఇలాంటి టోర్నమెంట్లో పోటీపడి విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని తెలియజేశారు. ఈ టోర్నమెంట్లో విజేతలకు ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లో శ్రీసాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు రోజురోజుకు పెరుగుతున్న సమయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ శాస్త్రి, శ్రీనివాసరావు, చిన్నారావు, నాగు, నరసింహారావు, పూర్ణ, రాజేశం, వాసు, బి.శ్రీనివాసరావు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ కోసం' సేవలు ప్రారంభం



బాలింతలను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మకోసం (ప్రసవాంతర సేవలు) కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. అమ్మ కోసం కార్యక్రమంలో భాగంగా మండల వైద్యురాలు డాక్టర్ ప్రియాంక బాలింతలను పరీక్షించి, ప్రసవాంతర సేవలపై అవగాహన కల్పించారు. ప్రసవాంతర బాలింతలకు వచ్చే ఇబ్బందుల గురించి వివరించారు. ప్రతి గురువారం పీహెచ్‌సీలో అమ్మకోసం క్లినిక్ నిర్వహించడం జరుగుతుందని, బాలింతలు ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పూలమ్మ, పీహెచ్‌ఎన్‌ఓ ఎస్తేరురాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌వీ శారారాణి, సుశీల, ప్రేమలత, లక్ష్మి, వాణి, జ్యోతి పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో ముత్యాలమ్మ అమ్మవారి ప్రతిష్ఠ కార్యక్రమంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేధ్యాలు సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. వివిధ కార్యక్రమాల్లో పాలుపంచుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో ఆశ్రమంలో అన్నదానాన్ని రంగనాథ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున రావు ఆర్థిక సహాయంతో నిర్వహించారు. గురువారం వైస్ ఎంపీపీ దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా ఆశ్రమం ఆధ్వర్యంలో 200 మంది నిరుపేదలకు అన్న ప్రసాదాలను వితరణగా అందజేశారు.

ముందుగా ఆ దంపతులు ఆశ్రమంలోని షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానంతో పాటుగా, నిరుపేదలైన వృద్ధులు, వికలాంగుల ఇంటి వద్దకే వెళ్లి స్వామి వారి అన్న ప్రసాదాన్ని అందజేశారు.

పలుచోట్ల వైద్య శిబిరాలు



మణుగూరురూరల్: గ్రామస్తులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చిన రాయిగూడెం గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం రాజీవ్‌గాంధీనగర్‌లోని ఎంజేపీ టీబీసీ బాలుర వసతి గృహంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్షించి మందులను అందజేయడంతో పాటు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. వేసవికాలం ప్రారంభమై తొలిదశలోనే విపరీతంగా ఎండ తీవ్రత ఉందని, ప్రజలు, విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, ఉమేష్, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు, రవి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాయకుల కాలనీలో..

చర్లరూరల్: మండలంలోని నాయకుల కాలనీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామంలోని వైద్య పరీక్షలు నిర్వహించిన కొయ్యూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్ మందులను పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలన్నారు. కార్యక్రమంలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శిరీష, హెల్త్ అసిస్టెంటు స్వరూప, ఆశా కార్యకర్త కుమారి పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

మణుగూరుటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలోని చినరాయిగూడెంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జ్వరపీడితుల, అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. అదేవిధంగా రాజీవ్‌గాంధీనగర్‌లో బీసీ బాలుర హాస్టల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి పిల్లలకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు శివకుమార్ మాట్లాడుతూ.. ఎండా కాలం నేపథ్యంలో తాగు నీరు ఎక్కువగా తీసుకోవడంతో పాటు అపరిశుభ్ర తినుబండారాలను భుజించకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, ఉమేశ్, వెంకటలక్ష్మి, హిమబిందు, రవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దూలుగొండ జాతర



ముసలమ్మ దేవతను తీసుకొస్తున్న భక్తులు



లక్ష్మీ దేవత గర్భగుడి వద్ద పూజలు చేస్తున్న జోగ వంశీయులు

గుండాల: ఈసం వంశీయుల ఆరాధ్య దైవం, దూలుగొండ ముసలమ్మ దేవత గురువారం గద్దెనెక్కడంతో నిండు జాతర మొదలైంది. మండలంలోని రోళ్లగడ్డ గ్రామంలో ఈసం వంశీయులు జాతర అంగరంగ వైభ వంగా జాతర నిర్వహించారు. బుధవారం మండల మెలుగుట, గుడి మెలుగుట నిర్వహించారు. గురువారం అమ్మవారిని గద్దెలపై ప్రతిష్ఠించారు. దేవతను తీసుకవచ్చే క్రమంలో భక్తులు డోలి చప్పుల్లతో నృత్యాలు చేశారు. మహి ళలు పూనకాలతో ఊగిపోయారు. వారి ఆచార సాంప్రదాయాలతో అమ్మవారిని కొలుసుకున్నారు. జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం దేవతలను వనానికి తరలించడంతో జాతర ముగిస్తుందని కమిటి సభ్యులు తెలిపారు. దేవతను గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకా ఇతర మండలాల ఆ వంశీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈసం కృష్ణ, సమ్మయ్య, రాంమూర్తి, పాపారావు, కృష్ణ, వెంకటనారయణ, మల్లయ్య, బిక్షం, సాంబయ్య, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి జాతర..

జోగ వంశస్తుల ఇలవేల్పు లక్ష్మీదేవత గుడి ప్రవేశంతో తూరుబాక గ్రామంలో గురువారం నిండు జాతర ప్రారంభమైంది. తెల్లవారు జామునుంచే వడ్డెలు లక్ష్మీదేవి, పోతురాజు వేషధారణలతో గ్రామా గ్రామాన ఊరేగింపు నిర్వహించారు. తూరుబాక, ముత్తాపురం, పడుగోనిగూడెం, జామరగూడెం గ్రామాల్లో జోగు (కట్న, కానుకలు) నిర్వహించారు. ఊరేగింపు అనంతరం గంగాస్నానం చేయించారు. అమ్మవారిని గుడిలో ప్రతిష్ఠాపనం చేసి, కుంకుమ పూజలు జరిపారు. గిరిజనుల ఆచార సాంప్రదాయలతో వడ్డెలు, తలపతులు ప్రత్యేక పూజలు చేశారు. డోలీలతో, కోలాటం ఆడుతూ నాట్యప్రదర్శన చేశారు. మహిళలు పూనకాలతో నృత్యాలు చేశారు. చుట్టుపక్క గ్రామాల్లోని జోగ వంశస్తులతో పాటు, ఇతర భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని గుడిలో ప్రతిష్ఠించడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జోగ పోతయ్య, పగడయ్య, కాంతారావు, నర్సయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధునాతన పరికరాలతో లాభాలు

కరకగూడెం: అధునాతన పరికరాలతో సాగు చేస్తే రైతులు లాభాలు గడించవచ్చని పినపాక పీఏసీఎస్ డైరెక్టర్ రావుల కనకయ్య గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో 'మన అగ్రోటిక్ శాఖను' ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నూతన పద్ధతులు అవలంభించి వ్యవసాయం సాగు చేయాలన్నారు.అదేవిధంగా అగ్రోటిక్ యంత్రాలు, పరికరాలను వినియోగించుకోవాలని కోరారు. అగ్రోటిక్ శాఖలో తైవాన్ స్ప్రేయర్, బ్యాటరీ స్ప్రేయర్, ఫవార్ వీడర్, టార్పలిన్స్, మోటార్స్ పరికరాలున్నాయి. తక్కువ ధరకు ఇవి లభించడమే కాకుండా ఎంతో మన్నికగా ఉంటాయని ఉచితంగా డోర్ డెలివరీ చేస్తారని అన్నారు. నిర్వాహకులు బొంగోని గణేష్ గౌడ్, పలు పార్టీల నాయకులు, కమలాకర్, ఎర్ర సురేష్ రైతులు,నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికలు పూర్తి

మణుగూరుటౌన్: ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం ముగిశాయి. అధ్యక్షుడిగా నలుగురు సభ్యులు బరిలో నిలవగా, చిర్రా రవికుమార్, మేదరమెట్ల శ్రీనివాస్‌లు సమాన ఓట్లతో ముందంజలో నిలిచారు. జనరల్ సెక్రటరీగా ఇద్దరు పోటీలో ఉండగా, యామ కవిత నాలుగు ఓట్ల తేడాతో గెలుపొందారు. మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో మొత్తం 45 ఓట్లకు 43 ఓట్లు పోలవగా, మధ్యాహ్నం 3.35 నిమిషాలకు ఎన్నికల అధికారి వెంకటరత్నం ఆధ్వర్యంలో లెక్కింపు ప్రారంభించారు. అధ్యక్ష పదవికి పోటీలో నలుగురు బరిలో ఉండగా, వారిలో చిర్రా రవి కుమార్, మేదరమెట్ల శ్రీనివాస్ 16-16 సమాన ఓట్లు పోలయ్యాయి. దీంతో సమాన ఓట్లు పొందిన ఇద్దరి అభిప్రాయాలు స్వీకరించిన ఎన్నికల అధికారి టాస్‌వేయగా, టాస్ గెలుపొందిన చిర్రా రవికుమార్ మొదటి ఆరు నెలలు, తర్వాతి ఆరు నెలలు శ్రీనివాస్ కొనసాగుతారని వెల్లడించారు.

ప్రభుత్వ షరతులతో నష్టం

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాల రీత్యా ఉచితంగా ఇసుక వాడుకొనే అవకాశం ఇవ్వడం మంచిదే అయినా వాగుల నుంచి మాత్రమే ప్రజల అవసరాలకు ఇసుకను తీసుకొని వాడుకోవాలని ప్రభుత్వం పెట్టిన షరతులు సరైంది కాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ అన్నారు. గురువారం మండలంలోని చిన్నార్లగూడెం గ్రామంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెట్టిన ఈ షరతు వల్ల ప్రజలకు నష్టం జరుగుతుంది తప్ప ప్రభుత్వం ఆశించినట్లుగా లాభం జరగదని అన్నారు. వెంటనే ప్రభుత్వం ఈ షరతుని వెనక్కి తీసుకోవాలని కోరారు. గోదావరి నది, ఇతర నదుల నుంచి కూడా ఉచితంగా ప్రభుత్వం ఇసుక తోలుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ దుమ్ముగూడెం మండల కార్యదర్శి దాసరి సాయన్న, డివిజన్ నాయకులు మునిగల శివప్రశాంత్, మునేశ్వరరావు, రామశెట్టి, కన్నయ్య, బుజ్జి బాబు, పున్నమ్మ, లక్ష్మి, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలివ్వాలి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు బాధితులకు మెరక ప్రాంతాలలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందించిన అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏటా వస్తున్న గోదావరి వరదలకు లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లు నీటమునిగి వాళ్లంతా నిరాశ్రయులవుతున్నారన్నారు. వరద బాధితులకు ఇళ్ల స్థలాలతో పాటుగా జీవనోపాధుల కోసం ప్రభుత్వభూమిని సాగుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముత్యాల సత్యనారాయణ, తారాచంద్, రాంబాబు, అనంతరాములు, ముత్తయ్య, మనోజ్, రవి, వెంకటేశ్, హతిరామ్, సరోజ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చర్ల: భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న వంద రోజుల దండయాత్రను విజయవంతం చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం జాయి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొయ్యూరులో జరిగిన సీఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు అన్నీ ప్రభుత్వాలు అన్యాయమే చేస్తున్నాయని, ఆదివాసీ మండలాలకు కూడలిగా ఉన్న భద్రాచలం కేంద్రంగా గిరిజన న్యాయ కళాశాలను ఏర్పాటు చేయడం వల్ల ఆదివాసీలను లబ్ది చేకూరుతుందని ఆయన అన్నారు. ఈ డిమాండ్‌తో త్వరలో వంద రోజుల దండయాత్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వంద రోజుల దండయాత్ర కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం బీఎస్పీ చర్ల మండల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పూనెం వరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, నాయకులు పూనెం రవి, కిరణ్, ఇర్పా సారయ్య, సరెం సతీష్, పూనెం వెంకటేష్ పాల్గొన్నారు.